🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
✆ : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 47 | 06-09-2021 | పుటలు : 4


## దశదిశలా విద్యా ప్రభలతో

# నన్నయ ఖ్యాతి

గోదావరి జిల్లాల విద్యాభివృద్ధికి పావన గౌతమీతీరంలో వెలసింది ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం. ఈ సంస్థ ప్రజల అభీష్టం! నాయకులు సాధన! మహనీయుల శ్వాస!! స్నాతకోత్తర విద్యతో ప్రతి ఏటా కొత్త కోర్సులను ఏర్పాటు చేస్తూ, గోదావరి జిల్లాల కళాశాలలకు విద్యాపరమైన మార్గదర్శకాలను అందిస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నంలో నన్నయ విశ్వవిద్యాలయం క్షణక్షణాభివృద్ధి చెందుతోంది. విశేషమైన విద్యా ప్రణాళికలతో, విద్యార్థులకు మేలు చేకూర్చే నిరంతరమైన ఆలోచనలతో, బహుముఖ ప్రజ్ఞతో ప్రస్తుత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. బాధ్యతలను తీసుకున్న అనతికాలంలోనే విశ్వవిద్యాలయానికి ISO,AICTE గుర్తింపును సాధించారు.ఇండోర్ హాల్,స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు ఖేలో ఇండియా ప్రాజెక్ట్( క్రీడాభివృద్ధి సంస్థ (SAI) నుండి 8.30 కోట్ల నిధుల సాధన, త్వరలోనే NAAC గ్రేడింగ్ తీసుకుని వచ్చే పనిలో విశ్వవిద్యాలయ ఆచార్యులతో, సిబ్బందితో నిమగ్నమై ఉన్నారు. గోదావరి జిల్లాల విద్యార్థులకు మరిన్ని కొత్త కోర్సులను విద్యా వసతుల్ని అందించే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. కొత్త కోర్సులు, వసతులు, సౌకర్యాలు వంటి వాటికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ప్రతిపాదనను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నారు. రెండు జిల్లాలను సస్యశ్యామలం చేసే గోదావరి ప్రవాహంలా ప్రతిష్ఠాత్మకంగా విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోంది. సమాజంలో స్తబ్దత ఆవరించిన కోవిడ్ సమయంలో విద్యాపరమైన చైతన్య భూమికను విశ్వవిద్యాలయం పోషించింది. అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాలు, విద్యార్థులకు వారివారి విషయాలపై అవగాహన పరిజ్ఞానానికి ఆయా విభాగాల ఆచార్యులు వెబినార్స్ నిర్వహించారు. సుమారుగా 100 కు పైగా వెబినార్లు,అధ్యాపక శిక్షణ కార్యక్రమాలు,వర్క్ షాప్స్ కోవిడ్ సమయములో నిర్వహించి అధ్యాపకులు,విద్యార్థులకు విద్యా సేవలందించిన ఘనత రాష్ట్రంలో నన్నయ విశ్వవిద్యాలయానికే దక్కుతుంది. విశ్వవిద్యాలయం కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆన్లైన్లో పాఠ్యాంశాల బోధన, పరీక్షల నిర్వహణ పూర్తి చేసింది. ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వ అధికారులు, సీనియర్ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకుంటూ నిరంతరం విద్యార్థులకు మేలు చేసే



### ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు!!

ప్రయత్నంలో ఉంది. విద్యా సంవత్సరంలో నష్టపోయిన కాలాన్ని సద్వినియోగం చేసింది. ప్రస్తుతం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ సిలబస్ పూర్తి చేసే పనిలో ఆచార్యులు నిమగ్నమయ్యారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి విశేషకృషి చేస్తున్న ఆచార్యులకు, బోధనేతర సిబ్బందికి శుభాకాంక్షలు!! విశ్వ విద్యాలయ అభివృద్ధికి నిరంతరం సహకరించే నాయకులకు, అధికారులకు, శ్రేయోభిలాషులకు, పాత్రికేయులకు, గోదావరి జిల్లాలు ప్రజలకు కృతజ్ఞతలు!!

- నన్నయవాణి

### విశ్వవిద్యాలయ అభివృద్ధే లక్ష్యం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని విద్యాపరంగా, పరిపాలనాపరంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యం. న్యాక్ గ్రేడ్ సాధించడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. న్యాక్ (NAAC) సాధన ద్వారా రూసా నిధులు వస్తాయి. తద్వారా వసతులు, వనరులు సమకూర్చి విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 430 కళాశాలలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఉంది. వందలాది మంది అధ్యాపకులు ఆయా కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. అధ్యాపకులకు అవసరమైన బోధన, నైపుణ్య, శిక్షణ తరగతులు నిర్వహించేందుకు విశ్వవిద్యాలయంలో హెచ్.ఆర్.డి. ఆవశ్యకత ఎంతో ఉంది. కాబట్టి విశ్వవిద్యాలయంలో హెచ్.ఆర్.డి. సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఉన్నత విద్య అభ్యసించాలని ఆసక్తితో ఉన్న గృహిణులకు ఉద్యోగులకు చక్కని అవకాశం కల్పించేందుకు త్వరలో దూర విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. కోవిడ్ నియంత్రణ అయిన తర్వాత సౌత్ జోన్ స్పోర్ట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తాం. క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

**- ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఉపకులపతి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ**

### సమిష్టి కృషితో అభివృద్ధి సాధిద్దాం



అందరి భాగస్వామ్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి లోనికి తీసుకువెళదాం. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నూతన విద్యా విధానాలు, పరిపాలనాదక్షతతో విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. విద్యార్థులచే నిర్వహించబడుతున్న బ్లడ్ డోనర్స్ హబ్,నూతనంగా ప్రారంభించిన డయల్ అప్ నన్నయ, వినిమయ లెక్చర్ క్లబ్, నన్నయవాణి పత్రిక వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయి.

**- ఆచార్య టి.అశోక్,రిజిస్ట్రార్.**

## గురువు స్థానాన్ని మరింత పెంచుదాం

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**04.09.21 (మీడియాసెల్)** తల్లిదండ్రులతోను,దైవంతోను సమానంగా గురువుకు స్థానాన్ని కల్పించే గొప్ప సంస్కృతి భారతదేశ సంస్కృతి అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో గురువుకు విశేష స్థానం ఉందని, దానిని పరిరక్షించుకుంటూ గురువు స్థానాన్ని మరింత ఉన్నత స్థితిలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. దేశ ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాల్సిన కీలక బాధ్యత గురువులపై ఉందని చెప్పారు. గురువు సమాజానికి మార్గదర్శి కావాలన్నారు. విశ్వ విద్యాలయం లోని అధ్యాపకులంతా విశ్వజనీనమైన ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపారు. ఉత్తమ గురువులకు శిష్యులే తొలిప్రాధాన్యమని, శిష్యుల ఉన్నతిని కోరుకునేవాడే నిజమైన గురువని చెప్పారు. విశ్వ విద్యాలయంలోని అధ్యాపకులు విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించేందుకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలోను, విద్యాబోధనలోను అప్‌డేట్‌గా ఉండాలని అన్నారు. యూనివర్సిటీలో హెచ్.ఆర్.డి. సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని, తద్వారా ఉభయగోదావరి జిల్లాల్లోని 430 కళాశాలల్లోని అధ్యాపకులకు విద్య, విజ్ఞానం, బోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన శిక్షణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయానికి త్వరలో నాక్ (NAAC) గుర్తింపు వస్తుందని, విశ్వ విద్యాలయానికి అవసరమైన వనరులు, వసతులు పూర్తిగా సమకూరుతాయని తెలిపారు. విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్యా బోధన అందించడమే లక్ష్యంగా ప్రతీ అధ్యా పకుడు పని చేయాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసి, గురువు గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ

# సంపాదకీయం



## ఆచార్య దేవోభవ!!

గురు శిష్య పరంపర మనదేశంలో అనాదిగా ఉన్నదే. గురువుల మీద శిష్యులకు విపరీతమైన గురి ఉంటుంది. శిష్యుల మీద గురువులకు అవ్యాజమైన వాత్సల్యం ఉంటుంది. చదువు మాత్రమే కాదు, విద్యార్థులకు వినయ విధేయతలను నేర్పేవారే గురువులు. ఎలాంటి స్వార్థం లేకుండా గురువులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. అలాంటి గొప్ప గురువుల ప్రస్తావనలు మన పురాణాల్లోనూ, చరిత్రలోనూ అడుగడుగునా కనిపిస్తాయి. మనిషి అభివృద్ధి పథంలో నడుస్తున్న ప్రతిచోటా గురువులనే వారుంటారు. వాళ్లు కేవలం సిలబస్ లోని పాఠాలను చెప్పడంతోనే సరిపెట్టుకోరు. విద్యార్థులకు లోకరీతిని అవగతం చేస్తారు. వాళ్ళ నడవడికను తీర్చిదిద్దుతారు. ఉన్నతమైన ఆశయాలను ఉద్బోధిస్తారు. ఆశయ సాధన దిశగా దిశానిర్దేశం చేస్తారు. స్థూలంగా విద్యార్థుల జీవితాలనే ప్రభావితం చేస్తారు. విద్యార్థుల మనసుల్లో దేవుళ్ళలా ఉండిపోతారు.


సాహిత్యంలో నోబెల్ బహుమతి సాధించిన కవీంద్రుడు రవీంద్రనాథ్ ఠాగూర్ గురుదేవునిగా సుప్రసిద్ధులు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన విద్యారంగంలో సంస్కరణల కోసం తనదైన శైలిలో అపారమైన కృషి చేశారు. నాలుగు గోడల మధ్య కాదు విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సింది... ప్రకృతి ఒడిలో వారికి చదువు చెప్పాలన్నదే ఆయన సిద్ధాంతం. మనదేశంలోని సంప్రదాయ గురుకుల పద్ధతి పైనే ఆయనకు ఎక్కువ నమ్మకం ఉండేది. తన నమ్మకాలకు, ఆశయాలకు అనుగుణంగానే టాగోర్ **1901**లో కలకత్తా నగరానికి చేరువలో గురుకుల పద్ధతిలో శాంతినికేతన్ ఆశ్రమాన్ని స్థాపించారు. తరువాత కాలంలో అదే విశ్వభారతి విశ్వవిద్యాలయంగా ఎదిగింది.

దేశం గర్వించదగ్గ క్షిపణి వీరుడు మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థులకు కలలు కనడం నేర్పిన గొప్ప గురువు. వృత్తిరీత్యా శాస్త్రవేత్త అయినా ప్రవృత్తి రీత్యా ఆయన బోధననే ఎక్కువగా ఇష్టపడేవారు. ఏమాత్రం వీలు దొరికినా విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. కలలు కనండి వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయండని ఆయన విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేవారు. రాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత సైతం ఆయన ఆ అలవాటును మానుకో లేదంటే బోధనపై ఆయనకు ఎంతటి మక్కువ ఉండేదో అర్థం చేసుకోవచ్చు. స్వాతంత్ర్య భారతదేశంలో రాధాకృష్ణన్ తర్వాత విద్యార్థుల మనసులను చూరగొన్నది రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాత్రమే. రాష్ట్రపతి పదవి నుంచి విరమణ పొందిన తర్వాత కూడా ఆయన పలు విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. విద్యార్థులకు బోధిస్తూనే తుది శ్వాస విడిచారు.

క్రీస్తుపూర్వమే మన దేశంలో గొప్ప గొప్ప గురుకులాలు ఉండేవి. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలు ఉండేవి. శాస్త్ర పారంగతులైన గురువులు వివిధ శాస్త్రాలలో విద్యార్థులను తీర్చిదిద్దే వారు. కొందరు గురువులు దేశ చరిత్ర గమనాన్నే మార్చారు. శాస్త్రాల పురోగతిలో మైలురాళ్ళుగా నిలిచారు. మన పురాణాల్లో గురుశిష్యుల సంబంధాలపై బోలెడన్ని కథలున్నాయి. గొప్పగొప్ప గురువుల గురించి, వారి విద్వత్తును గురించి, వారు పొందిన గౌరవం గురించి పురాణాల్లో చాలా ప్రస్తావనలు ఉన్నాయి. మన మత, ధార్మిక గ్రంథాలలో గురువుల ప్రస్తావన విశేషంగా కనిపిస్తుంది. ఆధ్యాత్మిక రంగంలో మనకు చాలామంది గురువులున్నారు. వారిలో కొందరు జాతికి దిశానిర్దేశం చేసిన అరుదైన గురువులు. ధార్మిక జీవన పునరుద్ధరణ కోసం వారు నిరుపమానమైన కృషి సాగించారు. సమాజంలోని వివక్షలను తొలగించేందుకు, శాంతి సామరస్యాల వైపు ప్రజలను మళ్ళించేందుకు వారి బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయి. నృత్య సంగీత సాహిత్యాది కళల్లోనూ, శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ చాలా మంది గొప్పగొప్ప గురువులు మనకు దర్శనమిస్తారు. వారినందరిని స్మరిస్తూ వారి మార్గంలో నడవడమే మనం వారికి సమర్పించే గురుదక్షిణ.

# భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకుందాం

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు


**30.08.21 (మీడియాసెల్)** భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకుంటూ భావితరాలకు అందించే విధంగా లోతైన అధ్యయనాలు చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియాలజీ విభాగం మరియు కేంద్ర భూగర్భ జల బోర్డు, జల శక్తి మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వెబినార్ ను నిర్వహించారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్ పై ప్రత్యేక ప్రాధాన్యాన్నిస్తూ తూర్పు గోదావరి జిల్లా ఆక్విఫర్ మ్యాపింగ్ & మేనేజ్‌మెంట్‌పై పబ్లిక్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ (PIP) జరిగింది. యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి డా. కె. నూకరత్నం కన్వీనర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ జియాలజిస్ట్ యూనివర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ భూగర్భ జలాల అధ్యయనం ఎంతో కీలకమైన అంశమని, దీనిలో లోతైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, జలవనరుల శాఖ, నది అభివృద్ధి & గంగా పునరుజ్జీవనం, జల శక్తి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, దక్షిణ ప్రాంతం, హైదరాబాద్ వారు "ప్రజా పరస్పర కార్యక్రమం (PIP) నిర్వహించడం హర్షణీయమన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని ఆక్విఫర్ మ్యాపింగ్ & మేనేజ్‌మెంట్ పలు కీలకమైన అంశాలు తెలుస్తాయని చెప్పారు. ప్రభుత్వం ప్రతి శాఖలోని పనులు, వాటి నిర్వహణ, ప్రజా ప్రయోజనాలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకుంటూ నూతన విషయాలపై దృష్టి సారించాలని తెలియజేశారు. డెల్టా ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యత, నాణ్యతకు సంబంధించిన పలు కీలక అంశాలను తెలియజేశారు. యాక్విఫర్ సిస్టమ్ పనితీరు ప్రయోజనాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. వక్తలు భూగర్భ జలాల లభ్యత నాణ్యతపై జి. కృష్ణమూర్తి, ప్రాంతీయ డైరెక్టర్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, దక్షిణ ప్రాంతం, హైదరాబాద్, హైడ్రో జియోలాజికల్ అంశాలు & అక్విఫర్ మ్యాపింగ్ మరియు మేనేజ్‌మెంట్ కాన్సెప్ట్‌లపై సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సైంటిస్ట్ కరోలిన్ లూయిస్, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఆక్విఫర్ మ్యాపింగ్ & మేనేజ్‌మెంట్ పై సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సైంటిస్ట్ , డా. వి. ఎస్. ఆర్ కృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో లో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ప్రిన్సిపాల్ డా. కె. రమణేశ్వరి, కన్వీనర్ డా. కె. నూకరత్నం, ఆచార్య వై. శ్రీనివాసరావు, డా. కె. వి. స్వామి, డా. శామ్యూల్ పీటర్, విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైవీ సుబ్బారెడ్డిని కలిసిన నన్నయ వీసీ


వైవీ సుబ్బారెడ్డికి సన్మానించి జ్ఞాపికను అందిస్తున్నవీసీ


**01.09.21 (మీడియాసెల్)** తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్, వై. ఎస్. ఆర్. కాంగ్రెస్ పార్టీ రీజనల్ చైర్మన్, ఉభయగోదావరి జిల్లాల రీజినయల్ కోఆర్డినేటర్ శ్రీ వై. వీ. సుబ్బారెడ్డిని వీసీ ఆచార్యమొక్కా జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన ప్రగతి నివేదికను వీసీ అందజేశారు. వైవీ సుబ్బారెడ్డిని శాలువాతో సన్మానించికి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తాను బాధ్యతలు స్వీకరించిన తరువాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో విజ్ఞానాన్ని వికసింపచేయడానికి నిర్వహించినజాతీయ, అంతర్జాతీయ వెబినార్లు, ఆన్ లైన్ తరగతులు, పరీక్షల నిర్వహణ వంటి అంశాలను వివరించారు. యూనివర్సిటీకి ఐ. ఎస్. ఓ. సర్టిఫికేషన్, ఎ. ఐ. సి. టి. ఐ. గుర్తింపు వంటివి సాధించామని త్వరలో నాక్ గుర్తింపును సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో వినూత్నంగా నిర్వహిస్తున్న డయల్ అప్ నన్నయ, నన్నయవాణి వారపత్రిక, నన్నయన్యూస్ టీవీ యూట్యూబ్ ఛానల్, బ్లడ్ డోనార్ హబ్, వినిమయలెక్చర్ క్లబ్ వంటి ప్రయోజనాలను వివరించా మన్నారు. వీటిపై వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించి అభినందనలు తెలియజేశారని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ లో మంచిగ్రేడ్ రావాలని ఆకాంక్షించారని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో తనవంతు సహాయ సహకారాలను అందిస్తారనని వైవీ సుబ్బారెడ్డి తెలిపారన్నారు.

# 7న నన్నయలో జాబ్ మేళా




**04.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 7వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. దీనికి సంబంధించి శనివారం వీసీ ఒక ప్రకటన విడుదల చేశారు. వికాస సంస్థవారు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 7వ తేది ఉదయం 10 గంటలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. డక్కన్ కెమికల్, హెచ్. సి. ఎల్, ఆర్. ఎస్. ఎం. ఐ. పి. ఎల్, హూండైమోబిస్, కంజెట్ సర్వీసెస్ వంటి కంపెనీలలో ఉద్యోగావకాశాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా కంపెనీలలో పోస్టుల ఆధారంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు అర్హతలని, వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీ ఈసీ మెంబర్ డా. బి. జగన్మోనరెడ్డి జాబ్ మేళాను పర్యవేక్షిస్తారని తెలియజేశారు.

## మంచి మాట



### "దీపాదుత్పన్న దీపమివ !"

దీపం వెలుగుతూ ఉంటేనే అనేక దీపాలను వెలిగించగలుగుతుంది. ఉపాధ్యాయుడు నిత్యం నేర్చుకుంటూ ఉంటేనే విద్యార్థులకు తాను నేర్పగలడు.

– రవీంద్రనాథ్ టాగోర్




ప్రతిభా వాణి

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్



విద్యార్థులు బ్రహ్మరథం పట్టిన అరుదైన గురువు ఆయన. సనాతన కాలం నాటి సంగతేమో కానీ ఆధునిక కాలంలో అలాంటి ఘనతను దక్కించుకున్న ఏకైక గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. మన దేశానికి తొలి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన ఆయన పదవ్వులకే వన్నె తెచ్చారు. రాజ్యాంగ పదవులు చేపట్టక ముందు ఆయన సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకునిగా పాఠాలు చెప్పారు. పాఠాలు బోధించిన ప్రతి విద్యా సంస్థల్లోనూ విద్యార్థుల మనసులపై ఆయన చెరగని ముద్ర వేశారు. మద్రాసు ప్రావిన్సులోని తిరుత్తణి సమీపంలోని కుగ్రామంలో 1888 సెప్టెంబర్ 5 న ఒక సామాన్య కుటుంబంలో జన్మించారు. రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి వీరస్వామి స్థానిక జమీందారు వద్ద రెవిన్యూ ఉద్యోగి. తల్లి సీతమ్మ గృహిణి. రాధాకృష్ణన్ బాల్యంనుంచే తెలివైన విద్యార్థి. తిరుత్తణి, తిరుపతి,వలజపేట పాఠశాలల్లో చదువుకున్నారు. పాఠశాల విద్య తర్వాత తొలుత వెల్లూరులోని వూరీస్ కాలేజీలో చేరినా, కొద్దికాలానికే అక్కడినుంచి మద్రాసు క్రిస్టియన్ కాలేజీకి మారారు. అక్కడి నుంచే ఆయన తన 20 ఏళ్ల వయసులోనే మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. రాధాకృష్ణన్ సోదరుని వరుస అయ్యే ఒకరు అదే కాలేజీలో ఫిలాసఫీ చదువుకున్నారు. ఆయన చదువు పూర్తవడంతో ఆ పుస్తకాలను రాధాకృష్ణన్ కు ఇచ్చారు. దాంతో రాధాకృష్ణన్ అసంకల్పితంగానే ఈ కోర్సులో చేరారు. చేరటం అసంకల్పితంగానే అయినా తర్వాత ఆయన తత్వశాస్త్రాన్ని ఇష్టంగానే అధ్యయనం చేశారు. వేదాంత విలువలు,వాటి అధి భౌతికతపై పరిశోధన చేశారు. చదువు పూర్తయిన ఏడాదిలోగానే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకుడిగా అవకాశం దొరికింది. తొమ్మిదేళ్లు గడిచేలోగా మైసూర్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ గా ఆహ్వానం లభించింది. మైసూర్ వర్సిటీ పరిధిలోని మహారాజా కాలేజీలో ప్రొఫెసర్ గా చేరారు. అనతి కాలంలోనే ఆయన తన బోధనా పటిమతో విద్యార్థులకు చేరువయ్యారు. మైసూర్లో పనిచేస్తుండగానే రవీంద్రనాథ్ ఠాగూర్ సిద్ధాంతంపై తొలి పుస్తకం రాశారు. ఆ పుస్తకానికి మేధావుల ప్రశంసలు లభించాయి. అంతేకాదు ఆహ్వానం కూడా వచ్చింది. మైసూరు వర్సిటీని వదిలి కలకత్తా వర్సీటీలో చేరడానికి ఊరు వదిలి వెళ్తున్నప్పుడు గుర్రపు బండిని పూలతో రథంలా అలంకరించి విద్యార్థులు స్వయంగా దానిని మైసూరు రైల్వే స్టేషన్ వరకు లాక్కుని వెళ్ళారంటే ఏ స్థాయిలో ఆయన విద్యార్థుల మనసులకు చేరువయ్యారో అర్థం చేసుకోవాల్సిందే. విద్యార్థుల అభిమానాన్ని అంతగా చూరగొన్నారు రాధాకృష్ణన్. తర్వాతి కాలంలో ఆంధ్ర యూనివర్సిటీకి, బెనారస్ హిందూ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ గా కూడా సేవలందించారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా పలువురు విద్యార్థులు అభిమానులు ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరారు. అయితే తన పుట్టిన రోజుకు బదులుగా ఆరోజు ఉపాధ్యాయుల దినోత్సవం గా జరుపుకుంటే తాను సంతోషిస్తానని ఆయన బదులిచ్చారు. ఆయన కోరిక మేరకు 1962 నుంచి సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మాన్య రాధాకృష్ణన్ గురుదేవులకు నన్నయవాణి అక్షర నీరాజనం!!



## గురువులకు వందనం

గురుదేవోభవ అన్నారు పెద్దలు
వీరివల్ల లభ్యం మనకెన్నో విద్యలు
చదివి ఎదిగి ఎక్కాలి మనం గద్దెలు
మీరు విన్నారుగా ఇక ఈ సుద్దులు
మారాలి మన అందరి బుద్ధులు
గురువుల గొప్పతనం గుర్తిద్దాం
ఆ దిశగా మనమంతా ప్రవర్తిద్దాం!
అక్షర లక్షల ఫలాలు అందించే
మా కల్పతరువు గురువు!!
బడిలో అక్షరాలను మాచే దిద్దించి
పలు పాఠముల తాను చదివించి
ఎక్కాలను మా బాగా రాయించి
లెక్కల్లో మమ్ముల తీర్చిదిద్దిన మా
చిన్నప్పటి బడిలోని మాస్టారే
ముద్దుల మూడవ గురువు
వీరికి వందనం అభివందనం!
ముమ్మూర్తులా త్రిమూర్తులైన..
అమ్మ, నాన్న, గురువు
ఈ ముగ్గురు గురువులకు వందనం!
అభివందనం! సుమచందనం!!

- గుర్రాల లక్ష్మారెడ్డి, కల్వకుర్తి.
నాగర్ కర్నూలు జిల్లా

## తస్మై శ్రీ గురవేనమః



అక్షరమనే పదునైన ఆయుధాన్ని
ఆప్యాయతతో అందించి,
మంచి కోసం,పలువురి ఆనందం,
విశ్వశ్రేయస్సు కొరకు మాత్రమే
వినియోగించమని బాధ్యతను
హెచ్చరికతో అప్పగించిన గురువర్యా!
మనఃపూర్వక నమస్సులు!!
గురువు దైవంతో సమానమని
గ్రహించిన శిష్యుని మాట.
గురువులేని విద్య గుడ్డి విద్యని
పెద్దల ఉవాచ.
గురువు గీసే గీత బ్రహ్మరాతని
అనుభవజ్ఞులు వెలిబుచ్చిన సారం.
విద్యా బోధనలో పుడమి తల్లిని మించిన
సహనం గురువుది.
అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని బోధించేది గురువు.
బోధన చేసి మార్గనిర్దేశం చూపేది గురువు.
తలచుకుంటే ఇంతటివాన్ని
ఎంతటి వాన్నైనా చేయగలిగేది గురువు.
ప్రతిభ చూపే శిష్యున్ని కన్న కొడుకు కంటే
మిన్నగా చూసేది గురువు.
గురువుని మించిన ప్రతిభ
శిష్యుడు వ్యక్తీకరిస్తున్నపుడు
అమితానందం పొందేది గురువు.
శిష్యుని నమస్కారం
అమృత భాండంగా భావించేది గురువు.
పూర్వజన్మ సుకృతం సహృదయుడగు గురువు లభించడం.
గొప్ప గురువు లెందరెందరో!
అందరికీ పాదాభివందనాలు!!

- ఖండాపు మన్మథరావు
పి.బి.సిద్ధార్థ కళాశాల, విజయవాడ.



అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకాయా!
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః!!
అజ్ఞానమనే అంధకారంతో కప్పబడి ఉన్న నా నేత్రాలను శుద్ధజ్ఞానమనే కాటుక కణికె చేత ఎవ్వరు ప్రకాశింపజేసెనో అట్టి గురుదేవునికి నా నమస్సులు!! - భర్తృహరి

**సెప్టెంబర్ 5**

**ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు!!**

- నన్నయవాణి

# ఎం.ఎస్.ఎన్. క్యాంపస్‌ను పరిశీలించిన వీసీ



**02.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ కాకినాడ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గురువారం పరిశీలించారు. క్యాంపస్ ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి,అధ్యాపకులు వీసీకి స్వాగతం పలికారు. ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ లో నేషనల్ కన్జర్వేటీవ్ ఆఫ్ఫారెస్ట్ వారు ఏర్పాటు చేయనున్న బయోడైవర్సిటీ పార్క్ అండ్ మ్యూజియంనకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారు. దీనిపై యూనివర్సిటీ ఇంజనీర్లకు పలు సూచనలు, సలహాలను వీసీ అందించారు.క్యాంపస్ లో జరుగుతున్న డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. తరువాత క్యాంపస్ లోనిఅధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయ క్యాంపస్ అభివృద్ధిలో సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు.త్వరలో కాకినాడ క్యాంపస్ బయోడైవర్సిటీ పార్క్ అండ్ మ్యూజియం, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జిల్లా కేంద్రమైన కాకినాడకు ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ ప్రత్యేక ఆకర్షణీయంగా ఉంటుందని అన్నారు. బయోడైవర్సిటీ పార్క్ అండ్ మ్యూజియంలతో పాటు రిసెర్చ్ సెల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. త్వరలో నేషనల్ కన్జర్వేటీవ్ ఆఫ్ఫారెస్ట్ వారితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటామని తెలియజేశారు. క్యాంపస్ లోని సిబ్బంది,విద్యార్థులు కోవిడ్ నిబంధనలను పాటిస్తూ పరీక్షలు, తరగతులు నిర్వహించాలని సూచించారు.



క్యాంపస్ లోని స్థలలను పరిశీలిస్తున్న వీసీ

# A Teacher's Prayer



Help me to remember the greatness
Of the work which has been given to me to do.
Help me always to remember that I work with the most precious materials in the world - the mind of the child.
Help me always to remember that I am making marks upon that mind which time will never rub out.
Give me patience to teach who are slow to learn, and even those who refuse to learn.
When I have to exercise discipline, help me to do so in sternness and yet in love.
Keep me away from the sarcastic and the biting tongue.
Help me to encourage and never to discourage those who are doing their best,even if that best is not very good.
Help me to help those children not to store things in their memories but to be able to use their minds and to think for themselves.
And in the midst of all the worries and the frustrations of my job - help me to remember that the future of nation and of the world is in my hands.

by...
**William Barclay**

# గురు దేవుని ప్రార్థన !



భగవాన్! నాకు విహితమైన అధ్యాపక వృత్తి ఎంత పవిత్రమైనదో, ఎంత సమున్నతమైన కర్తవ్యమో గుర్తించి, సదా స్మరించుకొనుటకు నీ సహాయమర్థించుచున్నాను. విశ్వాంతరాళమందు అత్యంత అమూల్యమైన విద్యార్థి మనసులతో నేను వర్తించుచు వ్యవహరించుచున్నానని అనుక్షణమూ స్మరించుకొనుటకు నీ సహాయము వేడుకొనుచున్నాను. విద్యార్థుల లేత మనసులపై కాలము సైతము చెరుపలేని ప్రగాఢ ముద్రలను వేయుచుంటినను స్మరణ నాకు సదా అనుగ్రహింపుము.

నెమ్మదిగా నేర్చుకొను, నేర్చుకొనుటకు ఇష్టము లేని విద్యార్థులకు సైతం నేర్పుగా నేర్పగల ఓర్పునొసంగి నా బోధనకు తగిన ప్రతిభనిచ్చి సహాయమొనర్పుము. క్రమశిక్షణ విషయంలో అవసరమగు కర్కశత్వమును పైకి బాహాటముగా ప్రదర్శించు చున్నను అంతరంగమున మాత్రము అనురాగ పూర్వకమైన హృదయమొసంగి సహాయమందిమ్ము. వ్యంగ్య ధోరణికి, మనస్సునకు బాధ కలిగించు సంభాషణమునకు నన్ను దూరము చేసి కాపాడుము.


తమ శాయశక్తులా కృషి చేయు విద్యార్థులను, ఆ కృషి సర్వోత్తమమైనది కాకున్నను, వారిని నిరంతరం ప్రోత్సహించుటకు, వారిని ఎన్నడూ నిరుత్సాహపరచకుండుటకు తగిన శక్తి యుక్తులను ప్రసాదించుము. కేవలం కంఠస్థమొనర్చుటగాక, విద్యార్థులు తమంతటతాము సొంతముగా ఆలోచించగల మేధాశక్తిని అలవర్చుకోగల సదభ్యాసమును వారికి నేర్పగల బలమొసంగుము.

పరాత్పరా! నా ఉద్యోగ బాధ్యతల నిర్వహణములో నైరాశ్యము, దుఃఖమయ పరిస్థితుల మధ్య నా వ్యక్తిగత విషయముల
లంపటములు నాకు మాత్రమే పరిమితము కావలెను. అట్టి విషమ దశయందు సైతం నా జాతి భవితవ్యమేకాక యావత్ప్రపంచ భవితవ్యం నా చేతులలో ఉన్నదని గుర్తించి, ఆ విషయాన్ని నేను ఎన్నడూ ఏమరుపాటు పొందని శక్తిని నా స్మృతి యందు నిలిపి నన్ను అనుగ్రహింపుము.

టీచర్స్ ప్రేయర్ : విలియం బర్క్ లీ
తెలుగు అనువాదం:
ఆచార్య పొన్నపల్లి శ్రీరామారావు,
ప్రిన్సిపాల్(రి) డిగ్రీ కళాశాల, మలికిపురం.

# లోకానికి ఒక లేఖ

\- అబ్రహం లింకన్



ఇంకొక రెండు గంటల్లో మా అబ్బాయి మొట్టమొదటిసారిగా బడిలో చేరబోతున్నాడు. ఈ లోకంలో ఉన్న మీరందరూ వాడిని చేయి పట్టుకొని నడిపిస్తారని నా ఆశ.

కొంతకాలంపాటు అంతా వింతగానూ, విడ్డూరంగానూ ఉండక తప్పదు. మీరందరూ వాడిని కొంచెం సుకుమారంగా చూస్తారని కూడా నా ఆశ. ఇప్పటిదాకా ఇంట్లో పెత్తనమంతా వాడిదేనని మీకూ తెలుసు. ఇంటి వెనుక తోట అంతా వాడి పరిపాలనలోనే ఉంది. ఎప్పుడైనా కన్నులు చెమ్మగిల్లితే ప్రక్కనే నాకోసం చూస్తాడు.

కానీ ఇప్పుడో... మొత్తం జీవిత రంగమే మారిపోతున్నది. కొంచెం సేపు గడిస్తే, ఇంటి ముందరి మెట్లుదిగి, వెనుకకు తిరిగి టాటా చెప్పి, గొప్ప సాహసవీరుడన్నట్లు బడి దగ్గరకు వస్తాడు. ఈ సాహసంలో విఘాతాలు, విషాదాలు, విచారాలు ఉండటం కూడా తథ్యమే.

ఈ ప్రపంచంలో జీవించడానికి శ్రద్ధా విశ్వాసాలు, ప్రేమ, ధైర్యము ఉండి తీరాలి. వాడు ఇంకా ఇవేవీ తెలియని చిన్నతనంలో ఉన్నాడు. కనుక వాడిని దగ్గరకు తీసుకొని, వాడు నేర్చుకోవలసిన విషయాలన్నీ అర్థమయ్యేటట్లు చేస్తారని నా ఆశ. వాడికి శిక్షణ ఇవ్వండి. చేతనైతే ఆ పని సౌమ్యంగా చెయ్యండి.

వాడు నేర్చుకోక తప్పదు. మనుష్యులందరూ న్యాయబద్ధులుగా ఉండరనీ, అందరూ నిజమే చెప్పరనీ నాకు తెలుసు. అసుర శీలం కలవాళ్ళతోపాటు అమరశీలం కలవాళ్ళు కూడా ఉన్నారనీ, ప్రజలను జీవచ్ఛవాలుగాచేసే రాజకీయ వాదులతో పాటు ప్రజాసేవకై ఆత్మార్పణం చేసే నాయకులున్నారని వాడికి తెలియాలి. ఒకడు శత్రువుగా ఉంటే ఇంకొకడు మిత్రుడుగా ఉంటాడని కూడా నేర్పండి.

పోట్ల దున్నపోతులాగా పుండరించి మీద మీదకు వచ్చేవాళ్లే మట్టికరచి మట్టిలోనే కలసిపోతారని కూడా వాడికి ఎంత త్వరగా తెలిస్తే అంత మంచిది. ఉద్గ్రంథాలలో ఉన్న అద్భుతాలు వాడికి తెలియాలి. వియత్పథంలో విహంగాలు, దినమణి రశ్మిలో తేనెటీగలు, హరితగిరులపై అలరించే విరులు, ఈ అన్నిటి వెనుక ఉన్న సృష్టి రహస్యం అవగాహన చేసుకొనడానికి వాడిని కొంతసేపు ప్రశాంతంగా ఉండనివ్వండి.

మోసగించి పైకి పోవడంకంటే కపటంలేని నిష్ఫలత్వంతో ఉండటమే ఎంతో గౌరవమని వాడికి తెలియాలి. ఇతరులెంత చెప్పినా ఒప్పుకొనలేనప్పుడు వాడి ఊహలమీద విశ్వాసం వాడికి ఉండనివ్వండి.

పేరుకోసమో, పెన్నిధికోసమో పిచ్చిగా రెచ్చిపోయే మందజనుల వెంట పడనివ్వని మనోబలం వాడికి ఇవ్వగలరా? అందరు చెప్పేదీ వినవచ్చు, కానీ అంతరంగంలో ఉన్న సత్యమనే తెరమీది వెలుగులో నిలబడగలిగిన వాటినే వాడు అనుసరించేటట్లు చేసి చూపించండి. బ్రతుకు తెరువు విషయంలో భుజ బలాన్ని, బుద్ధి బలాన్ని ఎక్కువ ఆశ పెట్టిన వాడికే ముడుపు కట్టినప్పటికీ ఆ ప్రభావం వాడి హృదయం మీద కానీ, అంతరాత్మ మీద కానీ పడకూడదు.

అనుచితమైన పని చెయ్యాలని అలమటించి అరచి చచ్చేవాళ్ళు ఎంతమంది ఉన్నా తనకు ఉచితమని తెలిసిన దానికోసం నిలబడి ప్రతిఘటించే బలం వాడికి రావాలి. ఈ శిక్షణ అంతా సౌమ్యంగా ఇవ్వండి. కానీ గారాబం చేయవద్దు. నిప్పులో ఉండవలసిన పరీక్ష నెగ్గి నిగానిగలాడుతూ వెలుపలికి వచ్చినదే నిజమైన ఉక్కు అన్న సంగతి కూడా నాకు తెలుసు. నా ఆశ ఆకాశమంత అంటే, ఆ మాట నిజమే, కానీ మీరు చెయ్యగలిగినది చెయ్యండి.

ఇంతగా అభ్యర్థించటం ఎందుకంటే ఈ రోజు వరకు వాడు అభం, శుభం ఎరుగడు. ఇతరులను ద్వేషించటం ఎరుగడు....

(అనువాదం : స్వర్గీయ శ్రీ వెంపటి కృష్ణమూర్తి గారు, తెలుగుశాఖ, శ్రీ వై.ఎన్. కళాశాల, నరసాపురం, ప.గో.జిల్లా.)

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in